సకాలంలో యూనిఫాంలు అందించాలి

కేశంపేట, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదవే విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలను అందజేయాలని డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యారావు సూచించారు. కొత్తపేటలో యూనిఫాం కుట్టు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. స్కూళ్లు తెరిచే సమయానికి యూనిఫాంల స్టిచింగ్ పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల కొలుతల ప్రకారమే డ్రెస్సులు కుట్టాలని తెలిపారు. జూన్ రెండో వారంలో పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని, ఈ లోపే పాఠశాలలకు యూనిఫాంలు అందజేయాలని సూచించారు. ఆయన వెంట డీపీఎం ఎఫ్ఐ బాలరాజు, ఏపీఎం భగవంత్, సీసీలు, మహిళా సంఘ సభ్యులు ఉన్నారు.

ఈ కార్యదర్శి మాకొద్దు!

వెంటనే బదిలీ చేయాలని కలెక్టరేట్ వద్ద గ్రామస్తుల నిరసన



నిరసన తెలుపుతున్న సింగంపల్లి గ్రామస్తులు

ఆమనగల్లు, మే 27(ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తూ గ్రామ సమస్యలు పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి జంగయ్యను వెంటనే బదిలీ చేయాలని మండలంలోని సింగంపల్లి గ్రామస్తులు మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీపీవోలకు వినతిపత్రాలు అందజేశారు. మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు వాహనాల్లో కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. తమ పంచాయతీ కార్యదర్శి జంగయ్య సరిగ్గా పనిచేయడం లేదని, ఇదేమని ప్రశ్నించే గ్రామస్తులను, నాయకులను అవమానించేలా మాట్లాడుతున్నాడని అధికారులకు వివరించారు. గ్రామంలో నెలకొన్న ఏ సమస్యపైనా కార్యదర్శి స్పందించడం లేదని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. అతడి నిర్లక్ష్యంపై మండల అధికారులకు తెలిపినా వారూ పట్టించుకోవడం లేదన్నారు. విధులు సక్రమంగా నిర్వర్తించని పంచాయతీ కార్యదర్శిని వెంటనే బదిలీ చేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు. తమ ఫిర్యాదుపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారని గ్రామ నాయకులు తెలిపారు.

నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాల బారిన పడకుండా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి, వానకాల పంటల సాగుపై అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. నకిలీ విత్తనాలమ్మితే అమ్మిన వారిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలన్నారు. తడిసిన వడ్లను కొనేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, కవర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని, నిర్మాణ ప్రక్రియ పక్కాగా జరిగేలా అధికారులు పని చేయాలని, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులకు ప్రణాళికను బుధవారంలోగా సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీవోలు చంద్రకళ, సరిత, వెంకట్‌రెడ్డి, అనంతరెడ్డి, హౌసింగ్ పీడీ హనుమంతునాయక్, వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే..

» షాద్‌నగర్‌లో ప్రజా సంఘాల నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల, వివిధ పార్టీల నాయకులు

షాద్‌నగర్ అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి):మావోయిస్టులను అంతమొందించేందుకు చేస్తున్న ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని వివిధ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. మంగళవారం షాద్‌నగర్ చౌరస్తాలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీఎస్పీ, సీపీఐ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌కౌంటర్ల పేరిట గిరిజనులను చంపుతూ శవాలను కూడా వారి కుటుంబీకులకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలయ్య, రాజావరప్రసాద్, రఘునాయక్, దొడ్డి శ్రీనివాస్, ఈశ్వర్, ప్రభాకర్, జనార్ధన్, అర్జునప్ప, నర్సింహులు, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

నకిలీ!

రైతుల పాలిట శాపంగా నకిలీ విత్తనాలు

- గ్రామాల్లోకి చేరుతున్న నకిలీ విత్తనాలు
- పత్తాలేని టాస్క్‌ఫోర్స్ అధికారులు
- అన్నదాతలకు అంటగడుతున్న వ్యాపారులు
- కాత, పూత లేక వేలాది ఎకరాల్లో పంటనష్టం



చన్వెల్లిలో పూత, కాత రాని బజ్జీ మిర్చి చేను



నారుతో రైతుల బోల్తా

చేవెళ్ల మండలం చన్వెల్లి గ్రామానికి చెందిన 40 మంది రైతులకు ఖమ్మం జిల్లాలోని కొనిజర్ల మండలం వైరా ప్రాంతంలోని మైక్రో గ్రో(మహారాష్ట్ర హైబ్రీడ్ సీడ్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్) నర్సరీకి చెందిన సిబ్బంది నకిలీ బజ్జి మిర్చి నారు అంటగట్టారు. మంచి దిగుబడి వస్తుందని మాయమాటలు చెప్పి ఒక్కో రైతు నుంచి ఎకరానికి రూ.15,600 చొప్పున 70 ఎకరాలకు సంబంధించి రూ.10.92 లక్షలు వసూలు చేశారు. దుక్కి దున్నిన దగ్గర నుంచి పంట వేసే వరకు ఒక్కో రైతు రూ.75వేల నుంచి రూ.1.2లక్షల వరకు ఖర్చు చేశారు. ఈ గ్రామంలో 70 ఎకరాలకు సంబంధించి రూ.84.4లక్షల మేర నష్టపోయారు. పామెనలో 20మంది రైతులు నకిలీ మిర్చి నారు వేసి నష్టపోయారు.

కలెక్టరేట్ వద్ద ఆందోళన

నకిలీ నారు అంటగట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పామెన, చన్వెల్లి రైతులు డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన కూడా తెలిపారు. కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారికి వినతి పత్రం ఇచ్చారు. బజ్జీ మిర్చి కాత కాయలేదని వాపోయారు. పెట్టుబడితో పాటు రెక్కల కష్టం కూడా వృథా అయ్యిందని, వెంటనే మైక్రోగ్రో నర్సరీ నిర్వాహకులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన పెట్టుబడి ఇప్పించాలని రైతులు డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న పామెన, చన్వెల్లి రైతులు(ఫైల్)

వానాకాలం సాగు మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుంది. దీంతో రైతులు ఇప్పటి నుంచే విత్తనాలు, ఎరువులు కొనే పనుల్లో బిజీగా ఉన్నారు. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు రైతులకు నకిలీ విత్తనాలను అంటగడుతున్నారు. ఆకర్షణీయ ప్యాకింగ్‌తో బ్రాండెడ్ పేరుతో నకిలీ విత్తనాలు అమ్ముతుండడంతో తీరా పంట పూత, కాత నష్టపోతున్నారు. ఇలాంటి ఉదంతాలు జిల్లాల్లో యేటా చోటుచేసుకుంటున్నా అధికారులు నకిలీ విత్తనాలను నియంత్రించలేకపోతున్నారు. దీంతో రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టిన రైతులు నష్టపోతూ అప్పులపాలవుతున్నారు.

రంగారెడ్డి అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాల బెడద అంతకంతకూ పెరుగుతోంది. ఏటా ఏప్రిల్, మే నెలల్లో వీటి విక్రయాలు గుట్టుగా సాగుతున్నాయి. నకిలీ విత్తనాలతో సేద్య రంగం తీవ్రంగా నష్టపోతోంది. జిల్లాలో ఊరూ పేరు లేని విత్తన బ్రాండ్‌లు వందల్లో చలామణీ అవుతున్నాయి. దళారులు నకిలీ విత్తనాలను అంటగడుతున్నారు. జిల్లాలో సాగయ్యే పత్తిలో 30 నుంచి 40శాతం బీటీ-3 విత్తనాలే కావడం గమనార్హం. ఏటా జిల్లాలో సీజన్‌కు ముందు నకిలీ పత్తి విత్తనాలను పట్టుకోవడం, కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారింది. నకిలీ పత్తి విత్తనాలు

మిగతా 8వ పేజీలో...

బీటీ-3పైనే ఆసక్తి..

నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాలపైనే రైతులు ఆసక్తి చూపుతున్నారు. కలుపు నివారణ లేకుండా పంట దిగుబడి వచ్చే అవకాశం ఉన్న బీటీ-3పై మక్కువ చూపుతున్నారు. ఈ విత్తనాలను ప్రభుత్వం నిషేధించినా అమ్మకాలు మాత్రం ఆగలేదు. డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారులు విక్రయిస్తున్నారు. కొందరు వ్యాపారులు గ్రామాల్లో ఏజెంట్లను రైతులకు నియమించుకుని విత్తనాలను అందజేస్తున్నారు. ఇప్పటికే కొంత మంది రైతుల వద్దకు బీటీ-3 విత్తనాలు చేరినట్లు తెలుస్తోంది.

కొరవడిన ముందుచూపు

నకిలీ విత్తనాల సరఫరాను అరికట్టేందుకు అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడం లేదు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా వ్యవసాయ శాఖ తీరు ఉంది. వానాకాల సీజన్ సమీపించింది. వ్యాపారులు, రైతులు విత్తనాల, ఎరువుల అమ్మకాలు, కొనుగోళ్లపై దృష్టి సారిస్తున్నారు. ఈ సమయంలో నకిలీ విత్తనాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి..? ఎవరు విక్రయిస్తున్నారు? అనే అంశంపై అధికారులు దృష్టి పెడితే చాలా మట్టుకు నివారించే అవకాశం ఉంది.

నిరుపయోగంగా దోబీ ఘాట్లు

బోరు వేసి మోటార్ బిగించని వైనం



ఆదిభట్లలో నీరు నింపక వినియోగంలో లేని దోబీ ఘాట్

- నీరు నింపక వృథాగా మారిన తొట్లు
- వృత్తి పనులకు రజకుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

ఆదిభట్ల, మే 27(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మునిసిపాలిటీలోని దోబీ ఘాట్లకు నీటి సరఫరా లేక కుల వృత్తిపై ఆధారపడిన రజకులు ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు పదుల సంఖ్యలో రజకులతో కళకళలాడిన దోబీ ఘాట్లు నేడు నీరు లేక వెలవెలబోతున్నాయి. మునిసిపాలిటీలో ఆదిభట్ల, బొంగ్లూర్, ఎంపీ పటేల్‌గూడ, మంగల్‌పల్లి, కొంగరకలాన్, రాందాస్‌పల్లిల్లోని రజక కుటుంబాలు

మిగతా 8వ పేజీలో...

ఏడాదిగా ఘాట్లు వృథాగా ఉంటున్నాయి



ఆదిభట్ల, ఎంపీపటేల్‌గూడలో దోబీ ఘాట్లలో బట్టలుతికి 30 నుంచి 40 కుటుంబాలు జీవనం సాగించేవారు. సంవత్సరం నుంచి నీటి సరఫరా లేక ఘాట్లు వృథాగా ఉన్నాయి. సమస్య పరిష్కారానికి ఎవరూ పట్టించుకోలేదు. నిరుపయోగంగా ఉన్న దోబీఘాట్లను వినియోగంలోకి తెచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- పడకంటి రవీందర్, రజక సంఘం నాయకుడు

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా

షాద్‌నగర్ అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మైనార్టీ కార్పొరేషన్ నుంచి మహిళలకు మంజూరైన 258 కుట్టు మిషన్లను మంగళవారం పంపిణీ చేశారు. ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ హాలులో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ హాజరై సేవింగ్ మిషన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తొలి సంక్షేమ పథకాన్ని మహిళలతోనే ప్రారంభించిందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి పలు పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఒబేదుల్లా మాట్లాడుతూ.. అన్ని వర్గాల మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు కృష్ణారెడ్డి, జి.బాల్‌రాజ్‌గౌడ్, తిరుపతిరెడ్డి, చెన్నయ్య, జమ్రుద్‌ఖాన్, సర్వర్‌పాషా, ఇబ్రహీం, ఎ.బస్వం, హరినాథ్‌రెడ్డి, నర్సింహ, ముబారక్ అలీ, ఖదీర్, సబియాసుల్తానా, అలియాసుల్తానా పాల్గొన్నారు.

మైసిగండి హుండీ ఆదాయం రూ.11.77 లక్షలు



హుండీ లెక్కింపులో ట్రస్టీ సిరోలి పంతూ, ఈవో స్నేహలత

ఆమనగల్లు, మే 27(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలం మైసిగండి మైసమ్మాలయంలో మంగళవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఫౌండర్ ట్రస్టీ రమావత్ సిరోలిపంతూ, ఈవో స్నేహలత, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్‌ల సమక్షంలో హైదరాబాద్‌కు చెందిన వీజీఎల్ అన్నపూర్ణ సేవా సమితి బృందం హుండీలను లెక్కించింది. 60రోజులకు రూ.11,77,715 ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. ఈ ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమచేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్పీ భాస్కర్, అరుణ్, యాదగిరి, చంద్రయ్య, కృష్ణ, రాములు, శ్రీనివాస్, పత్యాశ్రీనివాసులు, హర్షవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్, బీబీచారి, కెనరా బ్యాంక్ అధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



ప్రతీ పౌరుడు జాతీయ జెండా చేతపట్టి సైనికులకు మద్దతు తెలపాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. జిల్లాలో చేపట్టిన తిరంగా ర్యాలీ మంగళవారం కందుకూరుకు చేరింది. హైదరాబాద్-శ్రీశైలం రహదారి, పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. దేశరక్షణకు సైనికులు చేస్తున్నకృషిని వెలకట్టలేమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు బొక్క నర్సింహారెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్, దేవేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పల్లె కృష్ణగౌడ్, మల్లారెడ్డి, ప్రభాకర్, నిమ్మ అంజిరెడ్డి, మల్లేశ్, నర్సింహ, అశోక్‌గౌడ్, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, భూమిరెడ్డి, సత్తయ్య, కుమ్మరి మధుకర్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

- కందుకూరు, మే 27(ఆంధ్రజ్యోతి)

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి
డీఆర్డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నర్సింహ 7

నడి రోడ్డులో గుంత.. ప్రయాణికుల చింత
జిల్లేడ్ చౌదరిగూడలో మిషన్ భగీరథ గొయ్యి
వాహనదారులు, స్థానికుల ఇక్కట్లు 7

మిర్చి పంటను పరిశీలించిన అధికారులు



చేవెళ్ల, మే 27(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా నుంచి మిర్చి నారు తీసుకొచ్చి సాగు చేసి నష్టపోయిన పంటను వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం చన్వెల్లి గ్రామంలో పరిశీలించారు. గ్రామంలో 40 మంది రైతులు 70 ఎకరాల్లో సాగు చేసిన మిర్చి పంటను ఉద్యానవన శాఖ అధికారి కీర్తి, మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్ తదితరులు రైతులతో కలిసి మిర్చి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు చెప్పారు. కాగా, కాత, పూత లేకపోవడంతో రైతులు చాలా వరకు నష్టపోయారని గుర్తించినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మొయినాబాద్ రూరల్, మే27(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల హక్కులు, ఆత్మగౌరవం కోసం కృషిచేస్తానని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) చేవెళ్ల నియోజకవర్గ నూతన అధ్యక్షుడు చేగురి రాజు అన్నారు. మంగళవారం బాకారం జాగీర్ పరిధిలోని ఓ రిసార్ట్‌లో టీడబ్ల్యూజేఎఫ్ కార్యవర్గాన్ని కౌన్సిల్ సభ్యులు, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా మొయినాబాద్ మండలం అప్పారెడ్డిగూడకు చెందిన విలేకరి రాజును ఎన్నుకున్నారు. కార్యదర్శిగా జయచంద్ర(శంకర్‌పల్లి), ఉపాధ్యక్షుడిగా మహేశ్‌ను ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన సంఘం సభ్యులకు రాజు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్‌చారి, గణేష్, సైదులు, రమేష్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం సభ్యులు

జాబ్‌మేళాను విజయవంతం చేయాలి

● కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు/వికారాబాద్,మే 27(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈనెల29న తాండూరులో నిర్వహించే జాబ్‌మేళాను విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఈనెల 29న(గురువారం) తాండూరులో నిర్వహించే జాబ్‌మేళాపై తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి జిల్లా అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఉపాధి కల్పన, మార్కెటింగ్ మిషన్(ఇజీఎంఎం) ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 52 పారిశ్రామికరంగాల్లో 11వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. జాబ్‌మేళాకు వచ్చే నిరుద్యోగులకు మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పం మేరకు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో తాండూరులోని వినాయక కన్వెన్షన్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా స్టాళ్లను ఏర్పాటుచేసి తన వంతు సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఈజీఎంఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణన్, జేడీఎం సతీష్, తాండూరు సీడీపీవో శ్రీలత, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహరెడ్డి, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, పక్కన తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యువతీ యువకులు తరలిరావాలి

తాండూరు రూరల్: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళా కార్యక్రమాన్ని మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు తరలిరావలని తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జర్నె నాగప్ప మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్‌పాస్, ఫెయిల్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ అర్హతలు కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చూడాలి

యాచారం, మే 27(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున తాగు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శైలజ అన్నారు. మంగళవారం మండల పరిషత్‌లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడారు. తాగునీరు కలుషితమైతే అతిసార, విష జ్వరాలు ప్రబలుతాయన్నారు. హరితహారం కింద మొక్కలు నాటేందుకు జాగాలు గుర్తించి గుంతలు తవ్వించాలన్నారు. మురుగు నీరు రోడ్లపై పారకుండా చూసుకోవాలన్నారు. ఫామ్‌పాండ్ల నిర్మాణం తప్ప ఇతర పనులను ఉపాధి కూలీలతో చేయించొద్దన్నారు. ఫామ్‌పాండ్ల నిర్మాణంలో తాము జిల్లాలో టాప్‌లో ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో ప్రత్యేకాధికారి మాధవరావు, ఎంపీవో శైలజ, ఏపీవో లింగయ్య, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్‌రెడ్డి ఉన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో శైలజ

ఇంటి స్థలం విషయంలో గొడవ

బషీరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం విషయం ఇరు కుటుంబాల మధ్య గొడవకు దారితీసింది. ఈ ఘటన బషీరాబాద్ మండలం గంగ్వార్‌లో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చంద్రకళ, ప్రమీలమ్మ కుటుంబం, ఊరడి నర్సమ్మ కుటుంబీకులతో ఇంటి స్థలం విషయంలో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల చంద్రకళ కుటుంబం ఇంటిని నిర్మించేందుకు ప్రయత్నించగా, పక్కనే ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న ఉరడి నర్సమ్మ కుటుంబీకులు దారి స్థలం విడిచిపెట్టాలని కోరారు. ఈ స్థలం తమదంటూ చంద్రకళ కుటుంబీకులు తేల్చిచెప్పడంతో ఇరుకుటుంబాల మధ్య గొడవలు మొదలైంది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు పంచాయతీ కార్యదర్శి శృతికి ఫిర్యాదులు చేసుకున్నారు. మంగళవారం ఇరు కుటుంబాల మధ్య స్థలం విషయంలో ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ఎస్‌ఐ శంకర్, కార్యదర్శి అక్కడికి చేరుకుని ఇంటి నిర్మాణానికి ఇచ్చిన అనుమతి ప్రకారం ఇళ్లు కట్టుకోవాలని చంద్రకళ కుటుంబానికి సూచించారు. మరోమారు ఇరు కుటుంబాల మధ్య గొడవ పెద్దది కావడంతో ఎస్‌ఐ వారిని సముదాయించారు. అనంతరం కార్యదర్శి చంద్రకళ ఇంటిని నిర్మించుకునేందుకు కొలతలు చూపించడంతో ఇరు కుటుంబాలు,పెద్దలు శాంతించారు.



కొత్తూర్: ఎస్‌బీపల్లిలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు



యాచారం: మేడిపల్లిలో జొన్న విత్తనాలు వేస్తున్న రైతు

ఊపందుకున్న సాగు పనులు

కొత్తూర్/యాచారం, మే 27(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు విత్తనాలు నాటే పనిలో పడ్డారు. ఇప్పటికే వేసవి దుక్కులు చేసుకున్న వారు ప్రస్తుత వానలకు విత్తనాలు విత్తుతున్నారు. కొత్తూర్ మండలం కొడిచర్ల, ఎస్‌బీపల్లి, రెడ్డిపాలెం, గుడూర్ ప్రాంతాల్లో పత్తి విత్తనాలను నాటుతున్నారు. యాచారం మండలంలోని మేడిపల్లి, తాటిపర్తి గ్రామాల్లో జొన్నలు వేశారు. పశువుల ఎరువు పొలంలో చల్లి రెండుమార్లు దున్ని విత్తనాలు విత్తుతున్నారు. రోహిణి కార్తెలో మొక్కజొన్న విత్తుకుంటే దిగుబడి బాగా వస్తుందని రైతులు అన్నారు.

పాలబిల్లు చెల్లించేవరకు ట్యాంకర్‌ను వెళ్లనివ్వం

శీతలీకరణ కేంద్రానికి తాళం వేసి రైతుల నిరసన

మోత్కూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): తమకు పాల బిల్లు చెల్లించేంతవరకు ట్యాంకర్‌ను శీతలీకరణ కేంద్రంలోని వెళ్లనివ్వబోమని రాగిబావి గ్రామపాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం యాదాద్రి జిల్లా మోత్కూరులో ఈ సంఘటన జరిగింది. మోత్కూరులోని పాల శీతలీకరణ కేంద్రం పరిధిలో సుమారు 45 పాల సొసైటీలు (మదర్ డెయిరీకి సంబంధించిన పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు) ఉన్నాయి. పాడి రైతులకు మదర్ డెయిరీ ప్రతీ 15 రోజులకు ఒకసారి పాలబిల్లు చెల్లించాల్సి ఉంది. మార్చి నుంచి సుమారు మూడు నెలలుగా (ఐదుబిల్లులు) పాడి రైతులకు బిల్లు చెల్లించడం లేదు. ప్రతి 15 రోజులకు సుమారు రూ.20లక్షల చొప్పున ఇప్పటి వరకు ఐదు బిల్లులు కలిపి 45సొసైటీల రైతులకు సుమారు కోటి రూపాయలు చెల్లించాల్సి ఉంది. రైతులు ఎన్నిసార్లు అడిగినా ఇది ఇక్కడి సమస్య మాత్రమే కాదని, నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల స్థాయి మదర్ డెయిరీ వ్యాప్తంగా ఉన్న సమస్య తాము ఏమీ చేయలేమని అధికారులు దాటవేస్తూ వచ్చారు. రాగిబావి గ్రామ పాడి రైతులకు ఐదు బిల్లులు సుమారు రూ.4లక్షలు చెల్లించాల్సి ఉంది. దీంతో సుమారు 20మంది పాడి రైతులు మంగళవారం మోత్కూరు పాల శీతలీకరణకేంద్రం గేటుకు తాళం వేసి ధర్నాకు దిగారు. ఈ క్రమంలో ఆ కేంద్రం నుంచి పాలు తీసుకెళ్లడానికి పాలట్యాంకర్ వచ్చింది. శీతలీకరణ కేంద్రం సిబ్బంది నచ్చజెప్పినా వినకుండా తమ గ్రామంలో పండుగ ఉందని, పండుగ ఖర్చులకు కూడా తమ వద్ద డబ్బులేదని, తమకు బిల్లులు చెల్లించేవరకు ధర్నా విరమించేదిలేదంటూ ట్యాంకర్‌ను లోనికి వెళ్లనివ్వలేదు. దీంతో పాల శీతలీకరణ కేంద్రం మేనేజరుపరమేష్ సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి ఒకనెల బిల్లు(రెండు బిల్లులు) రూ.1.50 లక్షలకు చెక్కు రాసి ఇవ్వడంతో పాడి రైతులు ధర్నా విరమించి తాళం తీశారు.



ధర్నా చేస్తున్న పాడి రైతులు



కంకర వేశారు.. బీటీ మరిచారు

దుద్యాల, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాల్యానాయక్ తండాకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర బీటీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అందులో భాగంగా రోడ్డును తవ్వి కంకర వేశారు. ఐదు నెలలు గడుస్తున్నా బీటీ వేయకపోవడంతో వాహనదారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంకర రోడ్డుపై ప్రయాణం సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నామని తండావాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీరోడ్డు పనులను పూర్తి చేయాలని కోరారు.



అమ్మవారి దర్శనానికి వేచిఉన్న భక్తులు

కొత్లాపూర్ ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

● ఈ నెల 30న రథోత్సవం, సిడే కార్యక్రమాలు

తాండూరు రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని తాండూరు మండలం కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడో మంగళవారం సందర్భంగా భక్తులు తెల్లవారు జామునుంచే ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నవీన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ఈవో శేఖర్‌గౌడ్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా జాతరోత్సవాల్లో భాగంగా ఈనెల30న ప్రధాన ఘట్టాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఈవోలు తెలిపారు. ఆలయ నిర్మాణ దాత, అరవింద లింబావళి దంపతులు, తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి దంపతులు రథోత్సవానికి హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు.

పొలాలకు దారి కోసం వినతి

బషీరాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు వెళ్లేదారి కోసం బషీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్ రుక్సానా బేగంను కలిసి కాశీంపూర్ గ్రామ రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై కలెక్టర్, సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, వారి ఆదేశానుసారం సర్వేచేయించి దారి చూపించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. డీటీని కలిసిన వారిలో మాజీ సర్పంచ్ అంజిలయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బాబుషరీఫ్, రవి, శివ్యానాయక్, దస్తాప్ప, రామప్ప పాల్గొన్నారు.

అటవీ భూమిలో సాగు చేస్తే చర్యలు


సదస్సులో మాట్లాడుతున్న డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్

యాలాల, మే 27, (ఆంధ్రజ్యోతి): అటవీ భూముల్లో అక్రమంగా సాగు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్ హెచ్చరించారు. మంగళవారం యాలాల మండల పరిధిలోని సంగాయిపల్లితండాలో అడవుల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులను, వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అటవీ ప్రాంతలోకి ఎవరైనా అక్రమంగా ప్రవేశించినా, చెట్ల నరికివేతకు పాల్పడినా ఉపగ్రహ ఛాయా చిత్రాల ఆధారంగా గుర్తించి కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రాక్టర్, జేసీబీ యజమానులు రాత్రివేళల్లో అటవీ ప్రాంతంలోకి వెళ్లకూడదని, అలా వెళ్లి అడవిని ధ్వంసం చేస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అనంతరం ప్రజల చేత అడవిని రక్షించుకుందామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.రాజేందర్, ధారూర్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు కనకరాజు, శంకర్, ఇన్‌చార్జి తహసీల్దార్ కిరణ్‌కుమార్, యాలాల ఎస్‌ఐ గిరి, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో భారీ వర్షం


ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చందుపట్లగూడలో కురుస్తున్న వర్షం

ఘట్‌కేసర్, మే 27 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షంతో తొలకరి స్వాగతం పలికింది. ఘట్‌కేసర్ మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి కొంత ఎండ, అప్పుడప్పుడు మబ్బులు కమ్ముకొని తీవ్రమైన ఉక్కపోత వెరసి సాయంత్రానికి భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా వచ్చిన భారీ వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. గంటకు పైగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల రహదారులపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజ్

ఇళ్ల స్థలాల సమస్య త్వరలో పరిష్కారం

కందుకూరు, మే 27(ఆంధ్రజ్యోతి): కందుకూరులో గతంలో నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాల ఆధారం త్వరలో వారికి పొజిషన్ చూపుతామని ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో పేదలతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారితో ఆర్డీవో మాట్లాడుతూ.. కందుకూరులోని సర్వే నంబర్లు 788, 107లలో గతంలో ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చారని గుర్తుచేశారు. కానీ ఆ భూమిలో గుట్టలు, రాళ్లు ఉండడంతో పొజిషన్ చూపలేదన్నారు. నాలుగు నెలల క్రితం ఈ భూమి సర్వే చేయించినట్లు తెలిపారు. స్థలాన్ని చదును కోసం కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు చెప్పారు. నిధులు మంజూరు కాగానే రాళ్లను తొలగిస్తామన్నారు. నాయకుడు బాల్‌రాజ్ మాట్లాడుతూ.. ఇళ్ల పట్టాలిచ్చిన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, వారు ఇల్లు కట్టుకోకుంటే రద్దవుతాయని ఆర్డీవో దృష్టికి తెచ్చారు. వెంటనే పొజిషన్ చూపితే పునాదులు తీసుకుంటారని కోరారు. కార్యక్రమంలో మహిళలు ఇందిరమ్మ, శంకరమ్మ, బాలమణి, రామలక్ష్మి, కవిత, యాదమ్మ, లక్ష్మమ్మ, ఆండాలు, మహేందర్, రజియాబేగం, జంగమ్మ, సువర్ణ, చెంచల, పి.అరుణ, వి.జ్యోతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్డీఏ డీపీఎం నర్సింహ

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

యాచారం, మే 27(ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రంగారెడ్డి డీఆర్డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నర్సింహ తెలిపారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాల డ్వాక్రా పొదుపు సంఘాల సభ్యులకు చిన్న, మధ్యతరగతి పరిశ్రమల స్థాపనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వడానికి ముందుకు వచ్చిందని తెలిపారు. కిరాణ షాపులు, మేకలు, గొర్రెల పెంపకంతో పాటు ఇతరత్రా పరిశ్రమలు ఏర్పాటు చేసి స్వయం ఉపాధి పొందడంతో పాటు సాటి మహిళలకు ఉపాధి కల్పించడానికి మహిళలు ముందుకు రావాలన్నారు. మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించడంతో పాటు వ్యాపార ఉత్పత్తులు మార్కెటింగ్‌పై శిక్షణ ఇవ్వడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ర్యాంప్ పథకంలో భాగంగా సేవా స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో యాచారం మండలంలోని పలు గ్రామాల్లో మహిళలకు తరచూ శిక్షణ ఇవ్వడంతో పాటు చిన్న మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం నుంచి నిధులు ఇప్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మహిళలకు ఆహార ఉత్పత్తులు తయారు చేయడంపై శిక్షణ ఇచ్చి ఆదుకుంటామని సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ చెప్పారు. ఏపీఎం సాంబశివుడు, కోఆర్డినేటర్ కిరణ్, సీసీలు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పొలానికి బలం.. రైతుకు లాభం



పచ్చి రొట్టతో సాగుకు మేలు

దుద్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగు నేపథ్యంలో రైతులు పొలాల్లో దుక్కులు దున్నడంలో నిమగ్నమయ్యారు. భూసారాన్ని పెంచేందుకు గతంలో రైతులు పశువుల ఎరువులను వేసి కలియదున్నేవారు. ప్రస్తుతం పశుపోషణ తగ్గడంతో సేంద్రియ ఎరువుల స్థానంలో రసాయన ఎరువుల వాడకం ఎక్కువ అవుతోంది. దీంతో భూములు వాటి సహజ లక్షణాలు కోల్పోతున్నాయి. జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు చల్లితే పొలానికి బలం చేకూరుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. సేంద్రియ ఎరువులతోనే పంట దిగుబడిని రెట్టింపు చేసుకోవచ్చని చెబుతున్నారు. పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలను తప్పనిసరిగా పొలాల్లో వేసుకుంటే రసాయన ఎరువులతో అంతగా అవసరం ఉండదంటున్నారు.

ప్రయోజనాలెన్నో

పొలంలో జీలుగ చల్లిన తర్వాత ఏపుగా పెరిగి పూత దశలో ఉన్నప్పుడు కలియదున్నిన తర్వాత అవి పొలానికి విశేషమైన లాభాలను చేకూరుస్తుంది. విత్తనాలు చల్లుకోవడం ద్వారా నేల కోతకు గురి కాదు. మొక్కకు నత్రజని, సూపర్‌ఫాస్పేట్‌ను అదనంగా అందిస్తాయి. పైరు పొలంలో కలుపు మొక్కల పెరుగుదలను పూర్తిగా కంట్రోల్ చేస్తుంది. మాంగనీస్, జింక్, కాల్షియం, ఇనుము లాంటి సూక్ష్మధాతువులను పంటలకు చేకూరుస్తాయి. నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చుతాయి. వానపాముల ఉత్పత్తికి దోహదం చేస్తాయి. మొక్కల వేర్లు బాగా పెరిగి పోషకాలు బాగా గ్రహిస్తాయి.

సాగు విధానం

ఎకరానికి 10 నుంచి 12 కిలోల జీలుగ విత్తనాలను దుక్కిలో చల్లుకోవాలి లేదా సాళ్లలో విత్తుకోవాలి. మొక్కలు బాగా పెరిగేందుకు సరైన సమయంలో తడి పెట్టాలి. 25 నుంచి 30 రోజులకు మొక్కలు ఏపుగా పెరిగి, పూత దశకు చేరుకుంటాయి. ఆ సమయంలో రోటోవేటర్ సాయంతో కలియదున్నాలి. అనంతరం సూపర్ ఫాస్పేట్‌ను దుక్కిలో వేయాలి. దీంతో మొక్కల అవశేషాలు బాగా కుళ్లిపోతాయి. కుళ్లే దశలో నీటిని బాగా అందించాలి. కుళ్లి పచ్చిరొట్ట ఎరువులు తయారు అవుతాయి.

సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు



పీఏసీఎస్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. జీలుగ క్వింటాలు రూ.14250 కాగా 50శాతం సబ్సిడీ పోనూ అమ్మకపు ధర రూ.7125,30 కేజీల బస్తాకు సబ్సిడీ పోనూ రూ.2137,30 కిలోల బస్తా 2 ఎకరాల 5 గుంటల భూమిలో వాడుకోవచ్చు. జనుము క్వింటాలు రూ.12550 కాగా 50 శాతం సబ్సిడీ పోను రూ.6275, 40 కేజీల బస్తాకు సబ్సిడి పోనూ రూ.2150కి అందించడం జరుగుతుంది. ఆసక్తి గల రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్సలతో విత్తనాలను తీసుకోవాలి.

శంకర్‌రాథోడ్, ఏడీఏ, కొడంగల్


దాతర్ చెరువు కాలువను పరిశీలిస్తున్న ఏఈఈ హరిత

కాలువ కబ్జాకు రియల్ వ్యాపారి యత్నం

పరిశీలించిన అధికారులు

ఆదిభట్ల, మే 27(ఆంధ్రజ్యోతి): కాలువను కబ్జా చేసినట్లు పరిశీలనలో తేలితే చట్టపరమైన చర్యలు తప్పవని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఆదిభట్ల మున్సిపల్ కొంగరకలాన్ పరిధిలోని దాతర్ చెరువు కాలువను ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దాదాపు 500 మీటర్ల మేర కబ్జా చేసి, పాత కాలువను పూడ్చి రాత్రి రాత్రికే కొత్త కాలువను నిర్మిస్తున్నాడు. కాలువ కబ్జాతో పాటు పక్కన ఉన్న సమాధులను కూల్చివేశాడు. దాంతో కొంగరకలాన్‌కు చెందిన బుడగ జంగాల ప్రజలు, నీళ్ల హరిబాబు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు మంగళవారం ఇరిగేషన్ అధికారులు కాలువను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏఈఈ హరిత తెలిపిన వివరాల ప్రకారం.. దాతర్ చెరువు అలుగును కూల్చి, కాలువలో మట్టి పోసి ఆక్రమించారని తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. అలుగు కొంత మేర ఆక్రమించినట్లు తెలుస్తోందని, పాత కాలువ హద్దులు చెరిపి కొత్త కాలువ నిర్మిస్తున్నారని, దాతర్ చెరువు కట్టను కూడా కూల్చారని, కబ్జాపై రెవెన్యూ అధికారులకు లేఖ రాశామని తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో పూర్తిస్థాయిలో సర్వే చేస్తే ఎంత మేరకు కాలువ కబ్జాకు గురైందో తెలుస్తుందన్నారు. కాలువను కబ్జా చేసినట్లు తేలితే సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ఏఈఈతో పాటు ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సాయి తదితరులు ఉన్నారు.


శిక్షణ తరగతుల్లో డీఈవో, హిందీ పండిట్‌లు

డ్రగ్స్ అనర్థాలను విద్యార్థులకు వివరించాలి

ఉపాధ్యాయులకు డీఈవో సూచన

శంషాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా, డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై ఉపాధ్యాయులు సూచనలు చేయాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. శంషాబాద్‌లోని ఏడీపై పాఠశాలలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల హిందీ పండిత్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. విద్యార్థులు డ్రగ్స్ మహమ్మారి బారినపడకుండా చూడాల్సిన అంశాలపై తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని మంగళవారం డీఈవో పరిశీలించారు. టీచర్లతో ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడకంతో జరిగే అనర్థాలపై విద్యార్థులకు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు కూలంకుశంగా తెలియజేయాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజం అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డ్రగ్స్ నివారణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు హిందీ పండిత్‌లకు ఐదు రోజుల శిక్షణ ఇస్తున్నామని డీఈవో తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణ్ నాయక్, కోర్సు డైరెక్టర్ నరేందర్, రీసోర్స్ పర్సన్లు పాలొన్నారు.


ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆలయ పునర్‌నిర్మాణానికి రండి

తాండూరు, మే 27(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం ఇందిరానగర్‌లో ఈ నెల 30న రామ మందిర పునర్ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ముజీబ్‌ఖాన్‌ను ఆహ్వానించారు. తాండూరులో ఉన్న ఏకైక రామ మందిరాన్ని దాతల సహకారంతో పునర్‌నిర్మాణం చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులు

వికారాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటర్మీడియట్ జనరల్ విభాగం పరీక్షల చివరి రోజు ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. మంగళవారం జరిగిన కామర్స్, కెమిస్ట్రీ పరీక్షలకు 3,448 మంది విద్యార్థులకు 265 మంది గైర్హాజరయ్యారు. ఫస్టియర్ పరీక్షలకు 2,554 మంది హాజరు కావాల్సిన 2,349 మంది హాజరుకాగా, 205 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 2,515 మందికి 2,315 మంది హాజరుకాగా, 200 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షలకు 39 మందికి 34 మంది హాజరు కాగా, ఐదుగురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకెండియర్ పరీక్షలకు 894 మందికి 834 మంది హాజరు కాగా 60 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 866 మందికి 806 మంది హాజరుకాగా, 60 మంది హాజరు కాలేదు. ఒకేషనల్ పరీక్షలకు 28 మందికి 28 మందికి హాజరయ్యారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న అంజయ్య, దేవేందర్

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

షాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక శాఖ మండలాధ్యక్షుడు బేగరి అంజయ్య అన్నారు. ఈమేరకు ఈనెల 30న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. మంగళవారం షాబాద్‌లో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్‌తో కలిసి ఆయన విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కూలీల వేతన బకాయిలు విడుదల చేయాలని, పట్టణ పేదలకు ఉపాధి హామీ పని కల్పించాలని, కూలి రూ.600 చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. సీఐటీయూ మండల కన్వీనర్ నరసింహ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు నర్సింహ, సుధాకర్, వర్దన్, కార్తీక్, శంకర్, కార్తీక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్


సీఐకి నగదు అందిస్తున్న మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి

చేవెళ్ల, మే 27(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. మంగళవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని పామెన వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి రూ.1.5 లక్షలు సీఐకి అందజేశారు. నేర పరిశోధనలో పోలీసులకు సహకరించాలని సీఐ సూచించారు. నాయకులు ఎర్ర గోపాల్, గ్రామస్థులు ఉన్నారు.


పరిగికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు

రూ.200 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు


విద్యారణ్యపురిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి(ఫైల్)

పరిగి, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పరిగికి ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ స్కూల్ ఏర్పాటు గురించి ఈ నెల 14న పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి, టీజీఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతిరెడ్డి, అధికారులు పరిగి మున్సిపల్ పరిధిలోని విద్యారణ్యపురిలో స్థలాన్ని పరిశీలించిన విషయం విదితమే. స్థలంతోపాటు వసరుల గురించి ఎమ్మెల్యే సూచన మేరకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు ప్రభుత్వం పరిగిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పరిగిలో 20 ఎకరాల స్థలాన్ని ఇప్పటికే గుర్తించారు. ఈ స్థలంలో భవనం, ఇతర వసతులతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించనున్నారు. విద్యారణ్యపురిలో ఇప్పటికే పలు విద్యా సంస్థలు కొనసాగుతున్నాయి. ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుతో విద్యారణ్యపురి ఎడ్యుకేషన్ హబ్‌గా మారనుంది.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం ఇస్తున్న టీఎస్ఎస్‌వో నాయకులు

ఆమనగల్లు, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టూడెంట్ ఆర్గనైజేషన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం టీఎస్ఎస్‌వో రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి మీసాల బాలవర్షిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంఈవో పాండుకు వినతి పత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం రూపొందించి అమలు చేయాలని నాయకులు కోరారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలన్నారు. నాయకులు శివ, సాయి, శివనందు, అభి, శివ తదితరులు ఉన్నారు.

కలివి వనం పోస్టర్ ఆవిష్కరణ


కలివి వనం చిత్రం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేటీఆర్

చేవెళ్ల, మే 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంక్ డ్రాప్‌లో చేవెళ్ల ప్రాంతానికి చెందిన మల్లిఖార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలు ఏఆర్ ప్రొడక్షన్ బ్యానర్‌పై రాజ్ నరేంద్ర రచన, దర్శకత్వంలో నిర్మించిన కలివి వనం చిత్రం పోస్టర్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నగరంలోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. కలివి వనం చిత్రం వనాలను రక్షించుకునే నేపథ్యంలో తెలంగాణలోని జగిత్యాల జిల్లాలోని గుర్రాజపల్లి, సారంగపూర్ అటవీ ప్రాంతం, మల్లంపేట్, జగిత్యాల పలు చోట్ల చిత్రీకరించడం జరిగిందని నిర్మాతలు మల్లిఖార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ పల్లెటూరు బ్యాక్ డ్రాప్‌లో నిర్మించిన కలివి వనం చిత్రం భారీ విజయం సాధించాలన్నారు. నిర్మాతలకు మరిన్ని మంచి అవకాశాలు కల్పించేలా దేవుడి ఆశీర్వచనాలు ఉండాలన్నారు. తెలంగాణ నేపథ్యంలో వచ్చిన సినిమాలకు మంచి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ చిత్రంలో నటీనటులుగా రఘుబాబు, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి, అశోక్, సతీష్, బిత్తిరి సత్తి, బలగం సత్యనారాయణ, మహేంద్రనాథ్, శ్రీచరణ్, అశోక్, హీరోయిన్‌గా నాగదుర్గా నటిస్తున్నారని నిర్మాత మల్లిఖార్జున్ చెప్పారు. కార్యక్రమంలో నిర్మాతలు షాబాద్ మండల మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.


చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో గోపూజ చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గో పూజ

షాద్‌నగర్ అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో అమావాస్యను పురష్కరించుకొని మంగళవారం భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. ఆలయ పూజారులు రఘుపతిరావు, రాఘవేంద్రచారిలు భక్తులచే గోపూజ చేయించిన అనంతరం హోమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. అలాగే అక్కడే ఉన్న శ్రీకృష్ణ గోశాలకు బాలానగర్ మండలంలోని మోతిఘణాపూర్ గ్రామ శివారులోని నవదుర్గ ఐరన్ పరిశ్రమ మేనేజర్ బోలారాం ట్రాక్టర్ వరిగడ్డిని దానం చేశారు. నానాటికీ తగ్గిపోతున్న దేశీయ పశుసంపదను పరిరక్షించుకోవడానికి ప్రతీఒక్కరు తమ వంతు సహకారం చేయాలని బోలారాం కోరారు.

నడిరోడ్డులో గుంత.. ప్రయాణికుల చింత



చౌదరిగూడ, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో మిషన్ భగీరథ పైపులైన్ సరిచేసేందుకు తీసిన గోతిని పూడ్చకపోవడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకుగా ఉండే రోడ్డులో ఇలా గుంత తీసి వదిలేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వారాంతపు సంతకు చౌదరిగూడకు ప్రయాణికులు ఎక్కువ మొత్తంలో వస్తుంటారు. ఇటీవలే సీసీ రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు కాంట్రాక్టర్ గుంతను మరింత పెద్దగా తవ్వారు. కాగా, కేవలం అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు.


మహేశ్‌గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న శ్రీనివాస్‌గౌడ్

మహేశ్‌గౌడ్‌కు ఘన స్వాగతం

చేవెళ్ల, మే 27(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు చేరుకున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌కు కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఢిల్లీ నుంచి మంగళవారం రాత్రి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న మహేశ్‌గౌడ్‌కు కాంగ్రెస్ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు బియ్యని శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌కు శ్రీనివాస్‌గౌడ్ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుర్వ పాండుయాదవ్, కాంగ్రెస్ నాయకులు తల్లారం మాణిక్యం, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి వెళ్లొచ్చిన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, మే 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణ చేపట్టబోతున్న నేపథ్యంలో పలువురు మాదిగ సామాజిక ఎమ్మెల్యేలంతా ఢిల్లీకి వెళ్లారు. ఈ మేరకు మంగళవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఢిల్లీ వెళ్లారు. ఏఐసీసీ పెద్దలను ఎమ్మెల్యేలు కలిశారు. అయితే, మాదిగ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఏఐసీసీ అధిష్ఠానం వద్ద నాయకులను ఎమ్మెల్యేలు కోరినట్లు తెలిసింది. ఈమేరకు మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే యాదయ్య హైదరాబాద్‌కు చేరుకున్నారు.

కొనసాగుతున్న 'జన సేవాదళ్' శిక్షణ శిబిరం

చేవెళ్ల, మే 27(ఆంధ్రజ్యోతి): శిక్షణ శిబిరాలను జనసేవాదళ్ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కె. రామస్వామి తెలిపారు. సీపీఐ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జనసేవాదళ్ శిక్షణ శిబిరం రెండవ రోజు మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని సత్యసాయి పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు.

నకిలీ.. మకిలీ!


జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న పామెన, చనువల్లి రైతులు

(ఐదో పేజీ తరువాయి)

పూత కాతలేని మిరప, ఎదుగూ బొదుగూ లేని వరిపైర్లతో వేలాది ఎకరాల్లో పంట నష్టపోతున్నారు. కూరగాయ పంటలు, పప్పుధాన్యాలు, నూనె గింజలు వంటి పంటల్లోనూ నకిలీ విత్తనాల బెడద ఎక్కువైంది. వీటిని నుంచి రైతులు తప్పించుకోలేకపోతున్నారు. ఇదిలా ఉండగా నకిలీ విత్తనాలను విక్రయిస్తూ పట్టుబడ్డ వారిపై అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో వీరు మరింత హద్దులు దాటి వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులంతా విత్తనాలపై దృష్టిసారించారు. ఇదే అదునుగా భావిస్తున్న నకిలీ గాళ్లు రెచ్చిపోతున్నారు.

జిల్లాలో 3.47లక్షల ఎకరాల్లో సాగు

వానాకాలానికి ఇప్పటికే అధికారులు సాగు ప్రణాళిక సిద్ధం చేశారు. 3.47లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేస్తారని అంచనా వేశారు. ఈ సారి ఎక్కువగా వరి వేస్తారని భావిస్తున్నారు. సన్న వడ్లకు ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో రైతులు పత్తి సాగు తగ్గించి వరి ఎక్కువ వేస్తారని అనుకుంటున్నారు. గతేడాది 1,00,608 ఎకరాల్లో వరి సాగు చేయాలని నిర్ణయించగా ఈ ఏడాది 1,40,238 ఎరరాలకు పెంచారు. గతేడాది 1,77,735 ఎకరాల్లో పత్తి సాగు చేయాలని నిర్ణయించగా ఈ సారి 1,29,088 ఎకరాలకు కుదించారు. ఇప్పటికే రైతులు వేసవి దుక్కులు, సేంద్రియ ఎరువుల తరలింపు పనుల్లో నిమగ్నమయ్యారు. సీజన్ సమీపిస్తుండటంతో విత్తనాలు, ఎరువులను కొనుగోళ్లు ముమ్మరం కానున్నాయి. తొలకరివర్షాలు సైతం పడడం మొదలయ్యాయి. రుతు పవనాలు ముందుగా రావడంతో వానాకాలం పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు.

ఏవి నకిలో.. ఏవి అసలో

మార్కెట్‌లో అసలు విత్తనాలు ఏవో.. నకిలీవి ఏవో పోల్చుకోలేని పరిస్థితి నెలకొంది. ఏటా నకిలీ బారిన పడి రైతులు నష్టపోతున్నారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిపై వ్యవసాయాధికారులు దాడులు నిర్వహిస్తున్నా వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. తక్కువ ధర పేరిట వ్యాపారులు నకిలీ విత్తనాలను అంటగట్టి రైతులను మోసం చేస్తున్నారు. తీరా పంట పూత, కాతకు నోచుకోక రైతులు నష్టపోతున్నారు. బ్రాండెడ్ ప్యాకెట్లలో నకిలీ విత్తనాలను అంటగడుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో పూత, కాత రాక రైతులు లక్షల్లో నష్టపోతూ ఆత్మహత్యలే శరణ్యంగా మారుతోంది.

అంటగడుతున్న నకిలీ విత్తనాలు

రైతులకు వ్యాపారులు నకిలీ పత్తి, మిరప, వరి విత్తనాలు అంటగడుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి అమ్ముతున్నారు. యేటా వ్యవసాయ, టాస్క్‌ఫోర్స్ అధికారులు నకిలీ విత్తనాలను పట్టుకుంటున్నా వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నా నకిలీ విత్తన దందాకు చెక్ పడటం లేదు. ఫలితంగా అమాయక రైతులు నకిలీ విత్తన విక్రయదారుల మాయమాటలకు మోసపోతున్నారు.

రహస్యంగా దిగుమతి

వ్యాపారులు నిషేధిత పత్తి విత్తనాలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమంతి చేసుకుంటున్నారు. ఏపీ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి బీటీ-3 విత్తనాలు సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. కర్ణాటక, ఏపీలోని కర్నూల్, గుంటూరు జిల్లాల నుంచి తరలిస్తున్నట్లు సమాచారం. యేటా పట్టుబడుతున్న నకిలీ విత్తనాలు ఎక్కువ ఇవే ప్రాంతాల నుంచి వచ్చినట్లు అధికారులు నిర్ధారిస్తున్నారు. వ్యాపారులు దొంగచాటుగా వివిధ మార్గాల ద్వారా నకిలీ విత్తనాలను దిగుమతి చేసుకుంటున్నారు. మేడ్చల్ కేంద్రంగా ప్యాకింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానికంగా నిల్వ చేసుకున్న పత్తి విత్తనాలను రహస్యంగా ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లలో గ్రామాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందాపై అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

నకిలీ నారుతో మోసపోయా..



ఎకరం విస్తీర్ణంలో బజ్జీ మిర్చి సాగు చేశాను. పంట పెట్టుబడికి రూ.75వేలు ఖర్చు పెట్టాను. ఖమ్మం జిల్లా కొనిజెర్ల మండలం మధిర రోడ్డు వైరా ప్రాంతంలోని మైక్రోగ్రో నర్సరీకి చెందిన కొందరు మా గ్రామానికి వచ్చి నారు ఇచ్చారు. ఎకరానికి రూ.15,600 చెల్లించి నారు కొన్నా. అది నాటితే పూత రాలేదు.. కాపు కాయలేదు. నకిలీ నారుతో మోస పోయాను. నకిలీ నారు అమ్మినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– శ్రీకాంత్‌రెడ్డి, రైతు, చన్వల్లి

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతి

- లారీ కింద పడుకోవడంతో గమనించని డ్రైవర్
- వాహనంపై నుంచి వెళ్లడంతో దుర్మరణం



శంషాబాద్ రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): లారీపై నుంచి వెళ్లడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం శంషాబాద్ పోలీ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాల్మాకుల వద్ద లారీ(టీఎస్ 07 యూఎం 2751) నిలిపి ఉంది. కాగా, గుర్తు తెలియని వ్యక్తి (40) దాని కింద పడుకున్నాడు. గమనించని లారీడ్రైవర్ లారీని ముందుకు తీసుకెళ్లాడు. దాంతో ఆ వ్యక్తి పైనుంచి వెళ్లడంతో టైర్ల కింద నలిగి అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారి పరిసరాలను పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తి ఒంటిపై ఎరుపు రంగు షర్ట్, ఆకుపచ్చని ప్యాంట్ ఉందని పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

రైలు ఢీకొని వలస కార్మికుడు..

నందిగామ, మే 27(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వలస కార్మికుడు మృతి చెందిన సంఘటన నందిగామ శివారులోని హెచ్‌బీఎల్ పరిశ్రమ సమీపంలోని రైల్వేట్రాక్‌పై మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలిసుల వివరాల ప్రకారం.. మృతుడు ధరించిన ప్యాంటు జోబులో లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రమేష్‌గా గుర్తించారు. నందిగామ సమీపంలో రైలు ఢీకొని మృతిచెందినట్లు రైల్వేపోలీస్ మల్లేష్ తెలిపారు. మృతుడు రంగారెడ్డి జిల్లా కొత్తూరు శివారులోని ఈటా సబ్బుల పరిశ్రమలో పనిచేస్తున్నట్లు రైల్వే పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు మల్లేష్ తెలిపారు. తిమ్మాపూర్ స్టేషన్‌మాస్టర్ రహమత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ కూలీ..

కేశంపేట, మే 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కేశంపేట మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. కేశంపేట సీఐ నరహరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రం, రేవా జిల్లా, లీవలక్ష్మణ్‌పూర్ గ్రామానికి చెందిన సంతోష్ కుమార్ సాకేత్ తన భార్య కుష్బు సాకేత్‌లతో కలిసి కేశంపేట శివారులోని చెన్నమ్మనేని వంశీధర్ మామిడి తోటలో కూలి పనులు చేస్తూ అక్కడే నివాసం ఉండేవాడు. అదే తోటలో మధ్యప్రదేశ్‌కు చెందిన సందీప్ కూడా పనులు చేస్తూ అక్కడే ఉండేవాడు. సంతోష్ కుమార్, సందీప్‌లు ఈ నెల 26న కేశంపేట సమీపంలో ఉన్న ఎక్లాస్‌ఖాన్‌పేటలో ఉంటున్న సందీప్ వాళ్ల బంధువు మున్నాబెర్మా వద్దకు బైక్‌పై వెళ్లారు. సందీప్ అక్కడే ఉండడంతో సంతోష్ కుమార్ మోటార్ సైకిల్‌పై కేశంపేటలోని మామిడి తోటకు బయలు దేరాడు. మార్గమధ్యలో తలవానిగడ్డ వద్ద ఉన్న మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఉస్మానియాకు తరలించగా మంగళవారం మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు బైకులు ఢీ.. వ్యక్తికి తీవ్రగాయాలు

కందుకూరు, మే 27(ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడ్తాల మండల కేంద్రానికి చెందిన కడారి శివరాజు(68) మండలంలోని కొత్తూరు గ్రామంలో బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లాడు. మధ్యాహ్నం కడ్తాల మండల కేంద్రానికి వస్తుండగా గూడూరు గేటు వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. దాంతో శివరాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని శివరాజును నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

లారీ బోల్తా.. తప్పిన పెను ప్రమాదం


కొందుర్గులో బోల్తాపడిన లారీ

చౌదరిగూడ, మే 27(ఆంధ్రజ్యోతి): స్క్రాప్ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తాపడిన ఘటన కొందుర్గు మండల కేంద్రంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. షాద్‌నగర్ వైపు గ్యాస్ సిలిండర్ పాత సామాన్లు లోడ్ చేసుకుని కొందుర్గు వైపు వస్తుండగా రైస్ మిల్లు సమీపంలో లారీ కల్వర్టును ఢీకొని బోల్తాపడినట్లు తెలిపారు. ఘటన స్థలానికి కొందుర్గు పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. డ్రైవర్ అజయ్ లారీని నిద్రమత్తులో నడపడంతో బోల్తాపడినట్లు ఎస్సై రవిందర్ నాయక్ తెలిపారు. కానిస్టేబుల్ చందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బ్యాటరీల దొంగ అరెస్ట్.. రిమాండ్

కేశంపేట, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలో బ్యాటరీల వరుస దోపిడీకి పాల్పడుతున్న దొంగను కేశంపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లేమామిడి, బైర్కాన్‌పల్లిలో ఈనెల 18, 19వ తేదీలలో 12 ట్రాక్టర్ బ్యాటరీలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా, రంగనాయకపురం మండలం తాళ్లరేవుకు చెందిన మేడిశెట్టి నాగేశ్వరరావు హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కేశంపేట మండలంలో రెండు గ్రామాలలో 12 బ్యాటరీలను చోరీ చేశాడని తెలిపారు. ఈమేరకు నిందితుడిని మంగళవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరహరి తెలిపారు.

నెహ్రూకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఒబేదుల్లా కొత్వాల్

షాద్‌నగర్ అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళులర్పించారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన టీడీపీ నాయకులు


మహానాడుకు తరలివెళ్తున్న యాదిలాల్, టీడీపీ నాయకులు

ఆమనగల్లు, మే 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ మహానాడుకు ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఏపీలోని కడప జిల్లాలో మూడు రోజుల పాటు నిర్వహించే మహానాడుకు కల్వకుర్తి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి, టీడీపీ రాష్ట్ర నాయకుడు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాలలో బయలుదేరి వెళ్లారు. వివిధ గ్రామాల నుంచి ఆమనగల్లుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలు టీడీపీ జెండాలు చేబూని ఆమనగల్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ, చంద్రబాబు నాయుడుకు అనుకూలంగా నినాదాలు చేశారు. తెలంగాణలో టీడీపీకి త్వరలోనే పూర్వవైభవం వస్తుందని యాదిలాల్ తెలిపారు. టీడీపీ నాయకులు అర్జుం నర్సింహ, ఎస్డీ పంచాక్షరి, శ్రీనాథ్, వజ్రలింగం, తిమ్మయ్య, సత్తయ్యమహేందర్, తదితరులు ఉన్నారు.

212 వ రోజుకు చేరిన రిలే దీక్షలు

తలకొండపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు మంగళవారం 212వ రోజుకు చేరాయి.

నిరుపయోగంగా దోబీ ఘాట్లు


ఆదిభట్ల మునిసిపాలిటీ పరిధిలోని ఎంపీ పటేల్‌గూడలో నీరులేని దోబీ ఘాట్

(ఐదో పేజీ తరువాయి)

కుల వృత్తిపై ఆధారడ్డాయి. ప్రభుత్వం రజకులకు ఆదిభట్ల, ఎంపీపటేల్‌గూడ మీదుగా ప్రవహిస్తున్న పులందరి వాగు సమీప కల్వర్టుల వద్ద దోబీఘాట్లు నిర్మించింది. వాటిలో 50 రజక కుటుంబాలు బట్టలుతికి ఉపాధి పొందేవారు. ప టేల్‌గూడ దోబీఘాట్‌కు శ్మశానవాటికలోని బావి నీరే ఆధారం. ఆదిభట్లలోని దోబీఘాట్‌కు బోరు ఉండేది. అయితే బోరు మోటారు పాడైపోగా.. ఎంపీ పటేల్‌గూడలో పాత బావిని అధికారులు పూడ్చి వేయించడంతో రెండు దోబీఘాట్లకు నీటి సరఫరా లేక ఏడాదిగా అవి నిష్ప్రయోజనంగా మారాయి. దీంతో రజకులు వారి ఇళ్ల వద్దనే బట్టలు ఉతుకుతున్నారు. ఇంటి వద్ద సౌకర్యం లేనివారు వృత్తిని వదిలేసి కంపెనీల్లో పనిచేసుకుంటున్నారు. కొందరు రజకులు ప్రైవేట్ ట్యాంకర్ల నీటిని కొని వృత్తిని కొనసాగిస్తున్నారు. బోరులో మోటారు బిగించాలని రజకులు మున్సిపల్ అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉంటే, సంవత్సర కాలంగా నీటితొట్లను నింపకపోవడంతో పగుళ్లు వచ్చాయని రజకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఆదిభట్ల, ఎంపీపటేల్‌గూడల్లోని దోబీఘాట్లకు బోర్లతో నీరు నింపాలని చేతివృత్తుల సంఘాల నాయకులు, రజకులు డిమాండ్ చేస్తున్నారు.

అరకొర ఆదాయంతో వృత్తికి స్వస్తి

రజక కుటుంబాలు కూలి పనులు, కులవృత్తితో జీవనం సాగిస్తున్నారు. గతంలో కులవృత్తి చేస్తే ప్రతిఫలంగా రైతులు ధాన్యం ఇచ్చేవారు. ప్రస్తుతం డబ్బు ఇస్తున్నారు. అయితే గ్రామాంలో బట్టలుతికేందుకు చెరువులు, కుంటలు లేక దోబీ ఘాట్ల వద్దనే బట్టలుతికే వారు. దోబీఘాట్‌లో నీరు లేక నీటి ట్యాంకర్లు కొని వృత్తి కొనసాగిస్తే తమకేమీ మిగలడం లేదని రజకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరకొర ఆదాయం వస్తోందని వృత్తిని వదిలేస్తున్నారు. అధికారులు దోబీ ఘాట్లను పునరుద్ధరించాలని రజకులు కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు



ఆదిభట్ల మునిసిపాలిటీలో రెండు దోబీ ఘాట్లు ఉన్నది వాస్తవమే. కానీ నీటి సరఫరా లేదని, బోరు పనిచేయని విషయం నా దృష్టికి రాలేదు. క్షేత్రం స్థాయిలో పరిశీలించి బోరు ఉంటే నిధులు కేటాయించి మోటారు బిగించి దోబీ ఘాట్లుకు నీటి సౌకర్యం కల్పించి సమస్యను పరిష్కరిస్తాం.

– బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఆదిభట్ల

రాజకీయ మనుగడకు రైతులను రెచ్చగొడుతున్న విపక్షాలు


మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న గీతా నర్సింహ

ఆమనగల్లు, మే 27(ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతుంటే.. విపక్షాలు వారిని మరింత రెచ్చగొట్టి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నాయని ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతానర్సింహ అన్నారు. రాజకీయ మనుగడ కోసం రైతులను అడ్డం పెట్టుకొని విపక్షాలు ప్రభుత్వంపై విష ప్రచారాలు సాగిస్తున్నాయని మండిపడ్డారు. ఆమనగల్లు పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో మంగళవారం వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లతో కలిసి ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో గీత మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం చేపడుతున్న కార్యక్రమాలను జీర్ణించుకోలేక బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కుట్ర రాజకీయాలు సాగిస్తున్నారని అన్నారు. ధాన్యం విక్రయానికి తెచ్చిన సందర్భంలో అకాల వర్షంతో దాన్యం తడిస్తే దానికి ప్రభుత్వాన్ని నిందించడం విపక్షాల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. రైతుల చివరి దాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో వరి సాగు, దిగుబడి గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో రైతుల వద్ద రోజుకు 4వేల బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1.36 లక్షల బస్తాల ధాన్యాన్ని సేకరించామని, ఇంత పెద్దమొత్తంలో సేకరణ రికార్డు అని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీల చీకటి స్నేహం మరోసారి బయటపడిందన్నారు. డైరెక్టర్లు శ్రీశైలం, పాడురంగయ్య, తాళ్ల రవీందర్, మిట్టపల్లి అంజయ్య, వెంకట్ రెడ్డి, జంగయ్య గౌడ్, అజీం, రమేశ్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, పర్వతాలు, వెంకటేశ్, అనిల్ గౌడ్, విజేందర్, తదితరులున్నారు. కాగా, ధాన్యం తూకాలు వేగవంతం చేయాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు గీత సూచించారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లోని కొనుగోలు కేంద్రాన్ని వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

నీటిని పొదుపుగా వాడాలి


చేవెళ్ల : అవగాహన కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు

యాచారం/చేవెళ్ల, మే 27(ఆంధ్రజ్యోతి): నీటిని పొదుపుగా వాడి అధిక దిగుబడి సాధించడంపై రైతులు దృష్టిసారించాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ రైతులను సూచించారు. మంగళవారం మండలంలోని నానక్‌నగర్‌లో పంటల సాగు, ఎరువుల వాడకం, నీటిని పొదుపుగా వాడితే కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడితే మంచి దిగుబడి రావడంతో పాటు నేలలో సారవంతం కాపాడుకోవచ్చన్నారు. డ్రిప్‌తో కూరగాయల సాగు చేయడం చాలా మంచిదన్నారు. పురుగు మందులు చాలా తక్కువగా వాడాలని తద్వారా ఆహార ఉత్పత్తులు ఎక్కువ రోజులు నిల్వ ఉండడంతో పాటు అనేక పోషక పదార్థాలుండి మానవాళికి ఎంతో మేలు చేస్తాయని గమనించాలన్నారు. మండల వ్యవసాయాధికారి రవినాథ్ తదితరులు పాల్గొన్నారు. రైతులు సేంద్రియ ఎరువులు వాడి అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ చిరంజీవి, వినయ్ సూచించారు. చేవెళ్ల మండలంలోని గుండాలలో రైతులకు అవగాహన కల్పించారు. యూరియా వినియోగాన్ని తగ్గించాలన్నారు. ఏవో శంకర్‌లాల్, గుండాల పీఏసీఎస్ చైర్మన్ నక్క బుచ్చిరెడ్డి, ఏఈవో స్వాతిప్రియా, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


యాచారం : నానక్‌నగర్‌లో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పద్మజ

సేవలను బట్టే సమాజంలో కీర్తి

తలకొండపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): సేవలను బట్టే సమాజంలో కీర్తి లభిస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తలకొండపల్లి మండల వెల్జాల గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు మంగళవారం మెడికల్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక నాయకులతో కలిసి కిట్లు పంపిణీ చేశారు. మాజీ జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ముజుబుర్ రహెమాన్, నరేందర్‌గౌడ్, మోహన్‌లాల్, శ్రీకాంత్ యాదవ్, శ్రీరామ్, రాము, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మెడికల్ కిట్లు అందజేస్తున్న సీఎల్ శ్రీనివాస్ యాదవ్

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

షాద్‌నగర్ రూరల్, మే27(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ చట్ట రక్షణ, కూలీల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్ తెలిపారు. ఈమేరకు బూర్గుల గ్రామంలో మంగళవారం ఉపాధి కూలీలతో కలిసి కరపత్రం విడుదల చేశారు. నిత్యావసరాల ధరలకు అనుగుణంగా కూలీల వేతనాలు పెంచాలని అన్నారు. మృతి చెందిన కూలీలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలిపారు.

ముస్లిం మైనారిటీ గ్రామ కమిటీ

మంచాల, మే 27(ఆంధ్రజ్యోతి): ఆరుట్లలో ముస్లిం మైనారిటీ గ్రామ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా మండల మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండీ.సలాం, జానీపాషా, అధ్యక్షుడిగా ఎండీ యూసుఫ్ అలీ, ఉపాధ్యక్షులుగా ఎండీ ఇస్మాయిల్, ఎండీ ఫయాజ్, ఎండీ ఆసిఫ్‌ఖాన్, ప్రధాన సలహాదారుగా షేక్ జిలాని, ఎండీ అక్బర్ మియా, ప్రధాన కార్యదర్శిగా బాబుమియా, కోశాధికారిగా షేక్ జహంగీర్, సోషల్ మీడియా కార్యదర్శిగా ఎండీ ఖాజాభాయ్, హఫీజ్, కార్యవర్గసభ్యులుగా ఎండీ హమీద్, ఎండీ అమీర్, ఇమ్రాన్, గాలిబ్, జావీద్, ఎండీ ఖలీల్, ఎండీ మునీర్, ఎండీ ఖాఖేర్, ఎండీ, అజీమ్, ఎస్కే సద్దాం తదితరులను ఎన్నుకున్నారు.

పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టులా?

చౌదరిగూడ, మే 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పనులు చేసి బిల్లులు అడిగితే అరెస్టులా? అని జిల్లేడ్ చౌదరిగూడ మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు బాబురావు అన్నారు. మంగళవారం పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ నగరంలో తలపెట్టిన ధర్నాకు తరలివెళ్లకుండా పోలీస్‌లు బాబురావును ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో అప్పులు చేసి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేసినా బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా పెండింగ్ బిల్లుల చెల్లించడం లేదన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ

షాద్‌నగర్ రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): గురుకుల కళాశాల్లో చదువుకొని ఉద్యోగం పొందలేని యువతులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు కమ్మదనం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత తెలిపారు. 2017 నుంచి కమ్మదనం గురుకుల కళాశాలలో చదువుకుని ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. యువతులు 19నుంచి 25ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని, ఆసక్తి కలిగినవారు కమ్మదనం గురుకుల కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సబ్సిడీపై జీలుగ-జనుము విత్తనాలు

షాద్‌నగర్ అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటలకు సేంద్రియ ఎరువుగా వినియోగపడే జీలుగ, జనుము విత్తనాలను 50శాతం సబ్సిడీపై పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయని షాద్‌నగర్ ఏడీఏ నిశాంత్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రతీ రైతుకు ఒక హెక్టార్‌లో సాగుచేసుకునేలా విత్తనాలను ఇస్తామని తెలిపారు. షాద్‌నగర్ డివిజన్‌లోని అన్ని మండలాలకు జీలుగ, జనుము విత్తనాలు వచ్చాయని, కావాల్సిన రైతులు ఆయా మండల కేంద్రాల్లోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలకు వెళ్లి కొనుగోలు చేయాలని సూచించారు. జీలుగ క్వింటాలు ధర 14,250 రూపాయలు ఉందని, 50శాతం సబ్సిడీపై 30 కిలోల బస్తాకు 2,137.50 రూపాయలు చెల్లించాలని తెలిపారు. అలాగే 40 క్వింటాళ్ల జనుము విత్తనాల బస్తాకు 2,510 రూపాయలు చెల్లించాలని తెలిపారు. రైతులు ప్రతీ యేటా ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ విత్తనాల కోసం ఎదురు చూడకుండా రైతులే స్వయంగా విత్తనాలు వేసుకోవాలని నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు.